క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పెదకాకాని: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన నగదును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన గజ్జల ధనలక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. డాక్టర్ల సూచనల మేరకు ఆపరేషన్ చేయించుకుంది. ఆమె విజ్ఞప్తి మేరకు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ. 1,10,000 మంజూరు అయింది. చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గుంటూరులోని తన కార్యాలయంలో బాధితురాలి భర్త హరిబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు శివాబత్తుని దయానంద్, సభ్యుడు చెన్నుపాటి కల్యాణ్, నాయకుడు ముద్రబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలల్లో స్నేహపూర్వక ఉన్నతి సాధించాలి

పెదనందిపాడు: గ్రామాల్లోని బాలల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొనేలా వారికి అవగాహన కల్పించి స్నేహపూర్వక గ్రామాలుగా ఉన్నతిని సాధించేలా కృషి చేయాలని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి గ్రామ, వార్డు స్థాయి బాలల పరిరక్షణ కమిటీల విధివిధానాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిటీలు పని చేసే విధానం, సమస్యల గుర్తింపు, వాటి పరిష్కారం గురించి విజయ్‌కుమార్ వివరించారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో పనిచేసే విధానం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వి. సుజాతాదేవి, సూపర్‌వైజర్లు ఎండీ. జరీనా, ఎస్. భారతి పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): మానసిక వేదనతో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన దోరడ్ల సుధాకరరావు (42) ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాడు. శివభక్తుడైన అతడు వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిగా జీవనం సాగిస్తున్నాడు. కొద్ది నెలల కిందట తల్లి మరణించడంతో మానసికంగా కృంగి పోయాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి మంచినీటి చెరువు పక్కనున్న వెంకయ్య బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ డి. రవీంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీవితం మీద వైరాగ్యంతోనే కొడుకు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఓబారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గుండవరం(చేబ్రోలు): మండలంలోని గుండవరంలో శుక్రవారం గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్ని నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక రథంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదానంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం స్వామి వారి బొమ్మలకు పెయింటింగ్, మండపంలో గ్రానైట్ రాయి, టాయిలెట్స్ నిర్మాణాలను నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ప్రారంభించారు. అనంతరం స్వామిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసరావు, చైర్మన్ పి. జయ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్‌ని సత్కరించి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, శ్రీనివాసులు, అర్చకులు నరసింహాచార్యులు, మురళి, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి జగనన్న కృషి

గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత. వేదికపై జేసీఎస్ ఐదు జిల్లాల కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి, నియోజకవర్గం పరిశీలకుడు బొప్పన భవకుమార్ తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాల్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలో విలీనమైన ఎనిమిది డివిజన్ల గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల సమావేశాన్ని శుక్రవారం 40వ డివిజన్ పెదపలకలూరులోని రమణీయం కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుచరిత, ఎమ్మెల్సీ అభ్యర్థి మర్రి రాజశేఖర్, జేసీఎస్ ఐదు జిల్లాల కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం పరిశీలకుడు బొప్పన భవకుమార్‌తో కలసి పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన 48వ డివిజన్ కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మశాంతికి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లలో మహిళను భాగస్వామ్యం చేయాలనే జగనన్న ఆలోచన గొప్ప విధానమని కొనియాడారు. ఈ రోజు పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సుమారు నాలుగు లక్షల మందికి పైగా జగనన్న ఉపాధి అవకాశాల్ని కల్పించారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల్ని ప్రతి ఇంటికీ వెళ్లి గృహ సారథులు, వలంటీర్లు వారికి వివరించాలని తెలిపారు. సమస్యలు ఉంటే వాటిని జేసీఎస్ ఇంచార్జ్‌కి తెలియజేసి, పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. మనిషికి కళ్లు, ముక్కు, చెవి ఎంత అవసరమో వైఎస్సార్ సీపీకి గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు అంతే ముఖ్యమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మర్రి రాజశేఖర్

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలిపారు. దాన్ని చూసి ప్రతిపక్షాలు భయపడి ప్రభుత్వంపై బురద జల్లే కుట్రలు పన్నుతున్నాయని ధ్వజమెత్తారు. జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు సమష్టిగా కృషిచేసి ప్రజలకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల్ని వివరించాలని చెప్పారు.

ప్రభుత్వం మేలును వివరించాలి

జేసీఎస్ ఐదు జిల్లాల కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి అందించిన కిట్లను తీసుకుని ప్రతి కుటుంబాన్ని కలిసి, వారికి ప్రభుత్వం అందజేసిన మేలును వివరించాలని చెప్పారు. కుటుంబ పెద్దతో మాట్లాడి వారి సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారాలకు కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సాథులు వారథులుగా వ్యవహరించాలని చెప్పారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కార్యక్రమం సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల్ని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే సుచరితను మండల నాయకులు గజమాల, పూల కిరీటంతో ఘనంగా సన్మానించారు. జేసీఎస్ కన్వీనర్లకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, కార్పొరేటర్లు ఏరువ సాంబిరెడ్డి, బొడ్డుపల్లి స్మితపద్మజ, చల్లా రాజ్యలక్ష్మి, శ్యామల వెంకటరమణాదేవి, డివిజన్ ఇంచార్జ్‌లు ఆరిక శ్రీనివాసరెడ్డి, జల్లేపల్లి వేణుబాబు, పెద్దింటి రామకోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆళ్ల రవిదేవరాజు, నగర మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు పీర్ మహ్మద్, జేసీఎస్ మండల కన్వీనర్లు పిల్ల నాగేశ్వరరావు, దారం అశోక్, వెంకట్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో కృషే ప్రగతికి సోపానం

ఇండిపెండెంట్ డైరెక్టర్ ఆఫ్ బీఈఎంఎల్ శివమకుటమ్



సమావేశంలో మాట్లాడుతున్న శివమకుటమ్

గుంటూరు రూరల్: ఉన్నత లక్ష్యాలతో కూడిన కృషే ప్రగతికి సోపానమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొటెక్షన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బీఈఎంఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ శివమకుటమ్ తెలిపారు. నగర శివారు లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సోవమ్ 2023 యువజనోత్సవాల్లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత శిఖరాల్ని అధిరోహించేందుకు విద్య ఒక్కటే సాధనం కాదన్నారు. ఆత్మవిశ్వాసంతో పాటు జీవితం, సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాల్ని మెరుగు పరుచుకోవాలని తెలిపారు. దేశాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వై. సుజిత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సరైన నిర్ణయాలు తీసుకోవాలని, వీటిపైనే భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుందని సూచించారు. కళాశాల సాధించిన విజయాలు, నాక్ ఏ గ్రేడ్, ఎన్‌బీఏ, పరిశోధనల గురించి ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో విద్యార్థులకు వివిధ పోటీల్ని నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె. వెంకటరామారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా జాబితాల ఏర్పాటు

జాబితాల్లో పేర్లు సరి చూసుకోవాలి



జాబితాలను ఏర్పాటు చేస్తున్న ఏపీఎం సోమశేఖర్

కాకుమాను: వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల జాబితాల్లో అర్హులైన వారి పేర్లను సరి చూసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సోమశేఖర్ తెలిపారు. స్థానిక సచివాలయం-1లో శుక్రవారం వైఎస్సార్ ఆసరా జాబితాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో జాబితాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబితాల్లో పేర్లు ఉన్న మహిళలకు ఈనెల 25న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాల్లో నేరుగా నగదు చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ వసంత, సీసీలు సుబ్బారావు, రాఘవులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థినికి పెన్ను అందజేస్తున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: చదువులో వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి వారికి ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్ని ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా విభజించాలని, చివరి రెండు గ్రూపుల్లో ఉన్నవారికి ప్రత్యేక ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆయన తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచిన హెచ్ఎం మాధవిని అభినందించారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. చదువులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



బ్రిడ్జి వంతెనపై ఇరుక్కుపోయిన లారీ (ఇన్‌సెట్) లక్ష్మీనారాయణ మృతదేహం

చేబ్రోలు: గ్రావెల్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన నిమిశెట్టి లక్ష్మీనారాయణ(21) ఇంటర్ వరకు చదివి వడ్లమూడిలోని సంగం డెయిరీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం డ్యూటీకి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. స్నేహితుడు ఫోన్ చేయటంతో ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. మార్గంమధ్యలో గరువుపాలెం సంగం జాగర్లమూడి లాకుల వద్ద వెనుక నుంచి వచ్చిన గ్రావెల్ లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మరణించాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ను ఢీ కొట్టిన లారీ దూసుకు వెళ్లి వంతెన అంచున నిలిచిపోయింది. ముందు చక్రాలు గాలిలో ఉన్నాయి. మరికొద్దిగా వెళ్లి ఉంటే డ్రెయిన్‌లో బోల్తా పడేది. చేబ్రోలు ఎస్ఐ కె. ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.

గురువు ప్రోత్సాహంతోనే లక్ష్య సాధన

కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి



పరిశోధన పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: ఎమ్మెస్సీ మాథమాటిక్స్ చదివే రోజుల్లో గురువు శ్రీనాథ్ ప్రోత్సాహం తనను లక్ష్య సాధనవైపు నడిపిందని కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ మాథమాటికల్ సైన్సెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అంశంపై రెండు రోజులపాటు జరుగుతున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రసంగిస్తూ.. తాను ఎమ్మెస్సీ చదువుతున్నపుడు సివిల్ సర్వీసెస్ వైపు వెళ్లమని గురువు శ్రీనాథ్ ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. గణితం చదవడం వల్ల ప్రతి రోజు జిల్లా పరిపాలనలో ఎదురయ్యే ఎన్నో సమస్యల్ని విభిన్నంగా పరిష్కరించగలుగుతున్నానని చెప్పారు. గణితం మూలంగా తార్కికంగా, విశ్లేషణాత్మకంగా ఏ సమస్య మూలాన్నైనా అవగాహన చేసుకొని, పరిష్కరించవచ్చని వివరించారు. గణితం అనేది ప్రకృతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగించే పరికరం, పనిముట్టు, భాష అని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న తన గురువు శ్రీనాథ్‌కు కలెక్టర్ వినయంగా నమస్కరించి గురుభక్తి చాటుకున్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ స్వీయ క్రమ శిక్షణకు గణితం దోహదం చేస్తుందని తెలిపారు. తన గురువు శ్రీనాథ్ ముందు కలెక్టర్ చేతులు కట్టుకొని ఉండటాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అలహాబాద్ ప్రొఫెసర్ పంకజ్ శ్రీవాస్తవ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. గంగాధరరావు, రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, సైన్స్ సొసైటీ ఆఫ్ ఏపీ సీఈఓ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, ఏపీటీఎస్ఎంఎ జనరల్ సెక్రటరీ సి. జయసుబ్బారెడ్డి, గణితశాస్త్ర విభాగాధిపతి ఆర్. శ్రీనివాసరావు, సదస్సు డైరెక్టర్ బి. సత్యనారాయణ ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ, కలెక్టర్ ఆవిష్కరించారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు బెస్ట్ ఐఈటీఈ అవార్డు



అవార్డు చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నాణ్యత ప్రమాణాలతో విద్యా విధానాలు, విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషి ఫలితంగానే తమ కళాశాల ఎన్నో అవార్డుల్ని గెలుచుకుంటోందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2022 వార్షిక సంవత్సరానికి గానూ ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ ఇంజినీర్స్ విజయవాడ చాప్టర్ నుంచి తమ కళాశాలలోని ఐఈటీఈ విభాగానికి బెస్ట్ ఐఈటీఈ స్టూడెంట్ చాప్టర్ అవార్డు లభించిందని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు తమ కళాశాల విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలకు నిదర్శనమని చెప్పారు. కళాశాల ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో చదువుతున్న ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ విద్యార్థులు 450 మంది ఐఈటీ స్టూడెంట్ చాప్టర్‌లో రిజిస్టర్ అయ్యారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, స్టూడెంట్ చాప్టర్ కో-ఆర్డినేటర్ పి. శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆహార నాణ్యతపై అవగాహన అవసరం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ దీప

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆహార ప్రమాణాలు, నాణ్యత గురించి తెలుసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం హోం సైన్స్ శాస్త్రవేత్త ఎం.దీప తెలిపారు. రెండు రోజులుగా నగర శివారులోని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రంలో ఆహార ప్రమాణాలు, నాణ్యతపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం కొనసాగింది. కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కల్తీలను గుర్తించే విధానాల్ని శాస్త్రవేత్త దీప వివరించారు. యూరియా, టీ పౌడర్, నెయ్యి, తేనెలో జరిగే కల్తీలను తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

19న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు మధువని సుస్వరాల పల్లకీ సంస్థ ఆధ్వర్యంలో సుస్వర గీత మాలిక పేరుతో సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు మధుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గాయనీ, గాయకులు పాటల్ని ఆలపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్‌తో ప్రజారోగ్యం, పర్యావరణానికి విఘాతం

నెహ్రూనగర్: ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను విఘాతం కలిగించే ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని డెప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య సూచించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ విక్రయదారులతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం జిన్నా టవర్ వద్ద ఉన్న కుసుమ హరనాథ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయాల నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మంచి స్వచ్ఛ ర్యాంకింగ్ సాధించాలంటే తప్పనిసరిగా సిటీలో ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు జరగాలని తెలియచేశారు. రానున్న కాలంలో గుంటూరును ప్లాస్టిక్ రహితంగా, క్లీన్ గుంటూరు సాధనలో వ్యాపారస్తులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రజల్లో అవగాహన కోసం ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు వరుణుడి గండం



పెదకాకానిలో మిర్చిపై కప్పిన పట్టాలు



శ్రీరంగంపురంలో నేలవాలిన మొక్కజొన్న



నారాకోడూరులో మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు

చేబ్రోలు: రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు రైతుల్ని కలవరపరుస్తున్నాయి. మండలంలో ఈ ఏడాది రెండు వేల ఎకరాల్లో మిర్చి, ఏడు వేల ఎకరాల్లో మొక్కజొన్న, తెల్లజొన్న పంటలను సాగు చేస్తున్నారు. గుండవరం, నారాకోడూరు, వేజండ్ల, గొడవర్రు, కొత్తరెడ్డిపాలెం, శలపాడు తదితర గ్రామాల్లోన మిర్చి కోతలకు చేరుకొంది. పలువురు రైతులు కల్లాల్లోనే ఎండబెట్టారు. ప్రస్తుత అకాల వర్షం వారిని బెంబేలెత్తిస్తోంది. చేబ్రోలు, శ్రీరంగపురం, మంచాల, వడ్లమూడి, సుద్దపల్లి, నారాకోడూరు తదితర గ్రామాల్లో మొక్కజొన్న, తెల్లజొన్న పంటలను సాగు చేస్తున్న రైతులకు వర్షం గండం దిగులు పట్టుకుంది. గింజ పాలు పోసుకునే దశలో వర్షం పడితే తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురిసిన కొద్దిపాటి వర్షానికే శ్రీరంగపురం, చేబ్రోలు ప్రాంతాల్లోని కొన్ని మొక్కజొన్న పైర్లు నేల వాలాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి.

పెదకాకానిలో..

అకాల వర్షాలకు మిర్చి రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 400 ఎకరాల్లో పంట సాగు చేశారు. పలుచోట్ల కోతలు కూడా మొదలయ్యాయి. కొందరు రైతులు కల్లాల్లోనే పంటను నిల్వ చేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షపు జల్లులతో అప్రమత్తమయ్యారు. కల్లాల్లోని మిర్చి రాశులపై పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నా, పైన నీరు చేరింది. కూలీల సాయంతో తొలగించే పనులు మొదలెట్టారు. భారీ వర్షం కురిస్తే పంటకు నష్టం తప్పదని పలువురు రైతులు వాపోతున్నారు. వరుణుడు కరుణించాలని ప్రార్థిస్తున్నారు.

వివాలో ఆకట్టుకున్న డిజైన్ థింకింగ్‌పై సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని: మండలంలోని వివా ది స్కూల్ విద్యార్థులకు 'డిజైన్ థింకింగ్' అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. వీవీఐటీ నుంచి స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, డిజైన్ స్కూలు నుంచి యూనివర్సిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ (యూఐఎఫ్) ప్రోగ్రాంకు ఎంపికైన తొమ్మిది మంది విద్యార్థులు సహచర విద్యార్థులకు వివిధ అంశాల్ని వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలన్నీ డిజైన్ థింకింగ్ విధానాన్ని అనుసరిస్తున్నాయని, సరికొత్త ఆలోచనా విధానాన్ని ఇది పెంచుతుందని యూఐఎఫ్ సభ్యులు తెలిపారు. విద్యార్థుల్ని బృందాలుగా విభజించి సృజనాత్మక, వినూత్న రీతిలో సమస్య పరిష్కరించే విధానాల్ని వివరించారు. వ్యాపార దృక్పథాన్ని పెంచుకోవడం, తెలుసుకున్న అంశాల్ని ఆచరణలో పెట్టడాన్ని తెలిపారు. సదస్సు ద్వారా ఎన్నో అంశాల్ని తెలుసుకున్నామని, ఆలోచనలు అమలు చేసే ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు స్పష్టమయ్యాయని విద్యార్థులు తెలిపారు.

23న ప్రముఖులకు ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 23న ఉగాది పురస్కరించుకుని పలువురు వైద్యులు, ప్రభుత్వ అధికారిణులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సినీ సంగీత విభావరి, అనంతరం ప్రముఖులైన అడిషనల్ ఎస్పీ కె. సుప్రజ, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి. విజయ, ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ సీహెచ్. అమూల్య, బీసీ కార్పొరేషన్ ఈడీ డి. దుర్గాబాయి, సివిల్ సప్లయిస్ జీఎం జి.లక్ష్మి, సీఐడీ ఎస్పీ కె.జి.వి. సరిత, అన్నదాన సమాజం ఈవో డి. ప్రమీలారాణి, కాకి భాగ్యలక్ష్మి, మేకల శేషుకుమారికి పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో నిర్వాహకులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మిరియాల గోపీకుమార్, మేకల రవీంద్రబాబు పాల్గొన్నారు.